www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 25 | 20-03-2023 | పుటలు : 4




# నన్నయలో ఘనంగా ఇంజనీరింగ్ ఫ్రెషర్స్ పార్టీ




**18.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా ప్రెషర్స్ పార్టీనిచ్చారు. శనివారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చక్కని వాతావరణంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించటానికి వచ్చిన విద్యార్థులందరికీ స్వాగతం పలికారు. సీనియర్స్ జూనియర్స్ కు మార్గదర్శకంగా ఉండాలన్నారు. యూనివర్సిటీలో ఉన్న వనరులను, వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ ను మరియు పాఠ్యాంశాలపై పట్టును పెంపొందుచుకోవాలని చెప్పారు. తద్వారా విద్యాభ్యాస అనంతరం మంచి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. నన్నయ యూనివర్సిటీలో ర్యాగింగ్ లేకుండా చక్కని వాతావరణం ఉందని దానిని కొనసాగిస్తూ ఇంజనీరింగ్ విద్యార్థులంతా ప్రతిభావంతులైన ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. తరువాత వీసీని సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేసి ఉత్సాహంగా ఫ్రెషర్స్ పార్టీ వేడుకను విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.వి.పెర్సిస్, డా.బి.కెజియారాణి, కోర్సు కోఆర్డినేటర్స్ డా.జి.కీర్తిమరిట, బి.లక్ష్మీ, జె.హనుమంతు, బి.సుధాకిరణ్, సిహెచ్.శ్రీవర్మ తదితరులు పాల్గొన్నారు.





## ఉపకులపతి ఉవాచ



ఉగాది తెలుగు పదం. దీనికి ప్రకృతి యుగాది. యుగం అంటే జంట. సంఘజీవి అయిన మానవుడు జంట లేకుండా మనుగడ సాగించలేడు. అందుకే కాలంలో జంటలను బాగా గుర్తించాడు. రాత్రి - పగలు, శుక్లపక్షం - కృష్ణపక్షం, ఉత్తరాయణం - దక్షిణాయణం... ఇలా ప్రకృతి ద్వైదీ భావంతో నిండి ఉంది. ప్రపంచమంతా ద్వైదీ భావమే. కాల పరిగణనలో యుగాది ఒక ఆరంభ కాలం. ఉగాది అంటే ఏ పనికైనా ఉత్తమమైన ఆరంభం! కార్యసిద్ధికి సంకేతం!!

వేపపువ్వు, బెల్లం, మామిడి, కొత్త చింతపండు, చెరకు, అరటి...ఇలా షడ్రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడి ఉంటుంది. కాలానికి తగిన ఆహారం తీసుకోవాలని సందేశం. ఏ కాలంలో పండే పంటలు ఆ కాలంలో స్వీకరిస్తూ ప్రకృతికి దగ్గరగా ఆనందంగా జీవించటం ప్రకృతి శాస్త్రంలోని ఆరోగ్య సూత్రం. అదే ఉగాది పండుగ పరమార్థం. ఈ శోభకృత్ ఉగాది ప్రకృతికి, సమస్త మానవాళికి అందరికీ సంపూర్ణ శుభాలనందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

- జి.వి.ఆర్. ప్రసాదరాజు

## సంపాదకీయం



# ఎప్పటికప్పుడే కొత్త!

ప్రపంచమనే పుస్తకంలో ఎప్పటికప్పుడు ప్రతీది కొత్త పేజీ. అది ఒకకొత్త జీవితానికి శ్రీకారం చుడుతూ ఉంటుంది. *Every thing is Flux* అని ఇంగ్లీషులో ఒకమాటుంది.ప్రతి అంశం ప్రవాహాశీలమైందని అర్థం. నిన్నటిలా ఇవాళ ఉండదు. ఇవాల్టిలా రేపుండదు. నేను ఈ నదిలో ఈ నీటిలోనే స్నానం చేస్తుంటాను.. అంటాడు. అది అబద్ధం.నిన్నటి నీరు వేరు. ఇవాల్టి నీరు వేరు. అంతెందుకు మునిగి లేచిన ప్రతిసారి కొత్త నీటిలో స్నానం చేస్తుంటాం. ఇదే "ఎప్పటికప్పుడే కొత్త "అంటే!ఈ శీర్షికతో పద్మశ్రీ బోయి భీమన్నగారు ఒక పద్య ఖండికను రాశారు కూడా.

కాలచక్రం తిరిగిపోతూ ఉంటుంది.పైని ఆకులు క్రిందికి, పైకి క్రింది ఆకులు తిరుగుతూ ఉంటాయన్నారు విశ్వనాథ సత్యనారాయణ గారు. కాలమమూల్యంబు కదలు కుమార! అనంతకాల శికతముల యందు నీ కాలి ముద్రలు ముద్రించి పొమ్ము అంటారు మాతృదర్శనంలో దువ్వూరి రామిరెడ్డి గారు. కాలానికి ఒక రూపం లేదు, దానికి పాపం లేదు, కాలం అద్దం లాంటిది, అంధయుగమైనా స్వర్ణ యుగమైనా అది మన ప్రతిబింబం. కాలం వలయం లాంటిది. దానికి కేంద్రం లేదు. ఎవడికి వాడే ఇచ్ఛా ప్రయత్న బలంతో వర్ణోజ్వల వలయాలను సృష్టించగలుగుతాడు అంటారు తిలక్. కాలం గురించి ఆధునిక కవులు ఒక్కొక్కరు ఒక్కొక్క బాణీలో తమదైన శైలిలో కవితా ప్రక్రియలో విశ్లేషించారు.

ఉగాదికి వసంతం,కోకిల రాగం,వేపపూత,మామిడి... ఇవన్నీ క్రొత్తవే. ప్రతి క్షణం క్రొత్తగా మనకోసం వస్తూ ఉంటుంది. తనకు లభించిన క్షణాల్ని ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసుకున్న వాడి జీవితం వసంతమవుతుంది. జీవనవసంతంలోని మాధుర్యాన్ని హృదయం నిండా నింపుకోవటం మన చేతుల్లో ఉంది.కాలం నిత్యసంతోషి.నిరంతర పురోగామి. దానికి అన్ని ఋతువులు సమానమే. దానికి ఏ అవస్థ లేదు. మన అవస్థలను దానికి ఆపాదిస్తాం. ఎండ, వాన, శీత కాలాలను మన యవ్వన, ప్రౌఢ, వృద్ధాప్య అవస్థలతో పోల్చుకుంటాం. మన సుఖదుఃఖాలనే ప్రకృతిలో ప్రతిబింబాలుగా దర్శించుకుంటాం. అంతే!

ఇంగ్లీషు సాహిత్యంలో జే.ఎస్. మిల్ పండితుని మాట.. *Eternal Vigilance is the prince of Liberty* స్వేచ్ఛ యొక్క ఖరీదు నిత్యము జాగరూకతతో ఉండటమే.కాలం మారుతూ ఉంటుంది. కొత్త ఆలోచనలు, కొత్త ఉద్యమాలు వస్తూ పోతూ ఉంటాయి. అవి రోజూ వచ్చిపోయే ప్రభాత సాయం సంధ్య లాంటివి. ఆ రెండిటి నడిమి కాలంలో ఎవరైతే మేల్కొని ఉంటారో దానిని సద్వినియోగం చేసుకుంటారు. వారే దానికి అధిపతి అవుతారు. వారిదే పైచేయి అవుతుంది. బద్ధకస్తుడికి ఉషస్సు తెలియదు. ఖాళీగా ఉన్న మనిషి మెదడు దెయ్యాల ఖారానా అని ఒక మాట ఉంది.*(Devils Workshop)*. సోమరి చేయగలిగిందేముంది. సమాజం ముందు దోసిలొగ్గుతాడు.


కాబట్టి కాలం మారుతుంది.ఉగాది ప్రకృతిలోని మార్పుకి చిహ్నం.ఆ మార్పు మనిషి అభివృద్ధికి తీర్పు కావాలి. హృదయం నిండా కొత్త జీవనమనే అమృతాన్ని నింపుకొని నిత్యం జ్ఞానంతో బ్రతక నేర్చిన తెలివితేటలతో ఉండటమే మన ముందున్న కర్తవ్యం.అదే నిజమైన యుగాది!విజయోస్తు!!

# స్వచ్ఛోత్సవ్ సదస్సు




**18.03.23 (మీడియాసెల్)** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి మహిళను గుర్తించుటకు మినిస్ట్రీ ఆఫ్ హౌస్సింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ వారి ప్రోత్సాహంతో రాజమహేంద్రవరం మున్సిపాల్ కార్పొరేషన్ వారి సహకారంతో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నిర్వహించారు. శనివారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు హాజరై స్వచ్ఛోత్సవ్ విశిష్టతను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం మున్సిపాల్ కార్పొరేషన్, యూనివర్సిటీ బోటనీ విభాగం సువాస క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరిగిందన్నారు. స్వచ్ఛోత్సవ్ విన్ అవార్డ్స్, గార్బేజ్ ఫ్రీ సిటీ ఇన్ఫ్ ఫ్లూయిన్సెస్, స్వచ్ఛ్ యాత్ర, స్వచ్ఛత ప్లెడ్జ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారని చెప్పారు. "మై వేస్ట్ మై రెస్పాన్సబులిటీ టూ సెగ్రిగేట్" అనే నినాదాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్ఫర్మేషన్ ఇద్యుకేషన్ అండ్ కమ్యూనికేష్ స్పెషలిస్ట్ జె.ఎస్.ఆర్.అన్నమయ, ఇన్వర్మెంట్ అండ్ సోలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిపుణురాలు షేక్ సైదా తబసమ్, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, ఈసీ మెంబర్లు ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, బోటని విభాగాధ్యాపకులు డా.వి.పద్మావతి, డా.ఎల్.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


# జాతీయ సమగ్రతా శిబిరంలో వంశీ ప్రతిభ



వంశీకి సర్టిఫికెట్టునిచ్చి అభినందిస్తున్న వీసీ

**18.03.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిపార్టమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ చదువుతున్న సిష్టి వంశీ జాతీయ సమగ్రతా శిబిరంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచారని వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు అభినందించారు. శనివారం యూనివర్సిటీలో వంశీని అభినందించి వివరాలను తెలియజేసారు. పశ్చిమగోదావరి జిల్లా శ్రీ.వై.ఎన్.కాలేజ్ నర్సాపురంలో జరిగిన జాతీయ సమగ్రతా శిబిరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం నుండి సిష్టి వంశీ ఎంపికై ఉత్తమ ప్రతిభను కనపరిచాడని చెప్పారు. ఏడు రోజుల పాటు జరిగిన జాతీయ సమగ్రతా శిబిరంలో వంశీ సేవా, సాంస్కృతిక కార్యక్రమాలలో చురగ్గా పాల్గొన్నాడని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సమగ్రతా సర్టిఫికెట్టును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ.ఎం.శిరీష, డా.డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గేట్‌లో లైఫ్ సైన్సెస్ విద్యార్థుల ప్రతిభ





ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లైఫ్ సైన్స్ విభాగంలో బయో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ నందు జాతీయ స్థాయి పరీక్ష అయిన గేట్ నందు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. బయో కెమిస్ట్రీ విభాగం నుంచి జె. ఫాతిమా షేక్, బయోటెక్నాలజీ విభాగం నుంచి యు లిఖితాంజలి, కె అనిషా విద్యార్థులు గేట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించారు. వీరు జాతీయ అంతర్జాతీయ పరిశోధనా సంస్థలలో పీహెచ్డీ చేసుకునేందుకు అవకాశం చేజిక్కించుకున్నారు. అలాగే బయోటెక్నాలజీ విభాగం నుంచి షారోన్ రోజా అనే విద్యార్థిని ప్రఖ్యాత జాతీయ పరిశోధనా సంస్థ అయినా సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మోలిక్యులర్ బయాలజీ ( సీసీఎంబి) నందు సమ్మర్ రీసెర్చ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కి ఎంపికయ్యారు. బయో టెక్నాలజీ మరియు బయో కెమిస్ట్రీ విభాగాధిపతులు మరియు అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఎంఎస్సీ విద్యార్థులు గేట్ వంటి జాతీయస్థాయి పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పరీక్షల కోసం విభాగంలోని అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా వారి యొక్క విజయం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బందిని వారి యొక్క కృషిని కొనియాడారు.


# భారత స్వాతంత్ర్య సమరంలో గోదావరి తీరం

## సంకలనకర్త : పి.ఎస్. శర్మ

### పుస్తకం






ఈ గ్రంథం తూర్పుగోదావరి తీరంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమాన్ని మన ముందు ఉంచుతుంది. వాస్తవానికి ఈ పుస్తక ప్రథమ ముద్రణ 1987లో జరిగింది. ద్వితీయ ముద్రణ ఇటీవల2022లో జరిగింది. 35 ఏళ్ల తర్వాత మొదటి గ్రంథం లభ్యం కానీ పరిస్థితుల్లో పెద్దల కోరిక మేరకు ద్వితీయ ముద్రణ చేస్తూ గ్రంథాన్ని రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో గోదావరి తీరంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమం, రెండో భాగంలో తూర్పుగోదావరి జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంక్షిప్త చరిత్రలు ఉన్నాయి. రెండో భాగంలో ప్రధానంగా స్వాతంత్ర సమరయోధులకు పడిన శిక్షల వివరాలు, నిర్బంధించిన జైలు, అరెస్ట్ వివరాలు, పోలీసుల చేతిలో చంపబడ్డ వారి వివరాలు, ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, జర్నలిస్టులు, రచయితలు, న్యాయవాదుల వివరాలు ఇందులో పేర్కొన్నారు.

ఈ గ్రంథంలో భారత దేశ పూర్వ చరిత్ర సంక్షిప్తంగా పేర్కొంటూ జాతీయ ఉద్యమ ప్రారంభం స్వాతంత్ర సంగ్రామ చరిత్ర విశదీకరించి ఆంధ్ర రాష్ట్రపూర్వ రంగం, తూర్పుగోదావరి జిల్లా చరిత్రను వివరించారు. గోదావరి తీరంలో జరిగిన తొలి తిరుగుబాట్లు, గోదావరి తీరంలో 1885 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, స్వాతంత్రోద్యమ పూర్వ రంగం, స్వదేశీ ఉద్యమంలో కాకినాడలో జరిగిన ఇంగ్లీష్ క్లబ్ ధ్వంసం, కాకినాడ దొమ్మి కేసు, వందేమాతర ఉద్యమ దశ, ఆంధ్రోద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉద్యమంలో భాగంగా రాజమండ్రి ప్రభుత్వ కళాశాల నుండి బహిష్కరింపబడిన విద్యార్థుల వివరాలు, తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమ వివరాలను ఈ గ్రంథం మనకు వివరించింది.

భారత జాతీయ కాంగ్రెస్ 38వ మహాసభ (1923 - 24) కాకినాడలో జరిగింది. ఈ సభ ఏర్పాట్లు కార్యక్రమాలు, సేవాదల సేవలు, మన్యం ప్రాంతాలలో సాయిధ పోరాటం చేసిన సీతారామరాజు తిరుగుబాటులను దీనితో మన్యపు ప్రజల్లో వచ్చిన చైతన్యాన్ని వివరించింది.

సీతానగరంలోని గౌతమి సత్యాగ్రహాశ్రమంపై పోలీసు అధికారి ముస్తఫా బృందం చేసిన ధ్వంసం, ఆశ్రమాన్ని ప్రభుత్వం చట్టవిరుద్ధమని ప్రకటించడం మొదలైన వివరాలతో పాటు 1929 మే నెలలో గాంధీజీ ఆశ్రమంలో గడిపిన వైనాన్ని మనం గమనించవచ్చు.

జిల్లాలో జరిగిన గ్రంథాలయోద్యమం, హరిజన,వామపక్ష ,విద్యార్థి కార్మిక వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమం వీటి పూర్తి వివరాలు లభిస్తున్నాయి. వాడపల్లి తీర్థంలో పోలీసు కాల్పులు, కాకినాడ బాంబుకేసు, భయంకరాచారి పాత్ర, రైతు ఉద్యమం, ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమ వివరాలు ఈ గ్రంథంలో మన ముందుంచి మన నాయకుల పోరాట మహిమను,స్ఫూర్తిని మనకు అందించారు. ఆర్కెల్స్ రిపోర్టులు, పోరాట యోధులపై పెట్టిన కేసులు,సిఐడి రిపోర్ట్ లు ప్రచురించారు.

తూర్పుగోదావరి జిల్లా స్వాతంత్ర సమరయోధులచరిత్ర, జైలుశిక్ష అనుభవించిన వారి రికార్డులు, బ్రిటిష్ ప్రభుత్వం చేసిన క్రూర కృత్యాలు, కోర్టుతీర్పులు, గ్రామ గ్రామాన జరిగిన స్వాతంత్ర పోరాటాలు, స్త్రీలు, ఆదివాసీలు చేసిన త్యాగాలు ప్రస్తుత సమాజానికి అవసరమని గుర్తించి ఈ గ్రంథాన్ని పునర్ముద్రణకు పూనుకున్న డాక్టర్ పి. చిరంజీవినీ కుమారి గారికి అభివందనాలు తెలియజేస్తున్నాను. భారత స్వాతంత్ర సమరంలో అనేక సార్లు జైలు శిక్ష అనుభవించి అనేక ఉద్యమాలలో భాగస్వాములైన కీ. శే. శ్రీపి. ఎస్. శర్మగారు స్వాతంత్ర సమరాంగణంలో గోదావరి తీరమనే ఈ మహోన్నత గ్రంథాన్ని సంకలనం చేసి మనకు అందించినందుకు మనకు వారు సదా చిరస్మరణీయులు. ఇది విశ్వవిద్యాలయ గ్రంథాలయాల్లో,పబ్లిక్ లైబ్రరీస్,పరిశోధకుల దగ్గర తప్పనిసరిగా ఉండాల్సిన గ్రంథం.

మొదటి భాగం 551 పేజీలు రెండవ భాగం 130 పేజీలు. రెండుభాగాలు: 800 రూపాయలు.

ప్రతులకు: స్వాతంత్ర సమర చరిత్ర పరిశోధనా సంస్థ, 64 - 15 - 11 ప్రతాప్ నగర్, కాకినాడ 533 004.

ఫోన్: 0884 2378586, 9848160230

**సమీక్ష: డా.బిక్కని బాలకృష్ణ రాజనీతి శాస్త్ర ఆచార్యులు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**




# నన్నయలో పొట్టి శ్రీరాములు జయంతి

**16.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ శ్రీరాములుగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం శ్రీరాములు చేసిన దీక్షను, కృషిని వివరించారు. శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్రం సాధించవచ్చునని గాంధీజీ అన్న మాటలను గుర్తుచేసారు. మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారికి జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15 మరణించారని అన్నారు. ఈయన దీక్ష ఫలితంగా1953 అక్టోబరు1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. సత్యం, అహింసలతో ఎంతటి గొప్ప లక్ష్యాన్నైనా సాధించవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వర రావు, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, డా.ఎం.గోపాలకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సజ్జలను కలిసిన వీసీ ప్రసాదరాజు

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. సజ్జల రామకృష్ణారెడ్డిని విజయవాడ కార్యాలయంలో కలిసిన వీసీ ప్రసాదరాజు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు జేఎన్టీయూకే యూనివర్సిటీల అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని సజ్జల పేర్కొన్నారు.




## మంచిమాట

సహనంలేని వ్యక్తి ఎన్నటికీ విజయం పొందలేడు.

Have infinite patience, and success is yours.

- స్వామి వివేకానంద



# నన్నయ ఆచార్యునికి నివాళి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న డాక్టర్ మద్దా సత్యనారాయణ (58) ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. డా.సత్యనారాయణ మృతిపై విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు,రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్,ప్రిన్సిపల్ డా.కమల కుమారి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు దిగ్భ్రాంతి చెందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మరియు ప్రస్తుత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో గత 22 సంవత్సరాలుగా సేవలందిస్తూ అందర్నీ కలుపుకునే మనస్తత్వం కలిగి, ఏ సమస్య వచ్చినా చాకచక్యంగా పరిష్కరించేవారని పేరుంది. అనేకమంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి విద్యా ఉద్యోగాలలో స్థిరపడడానికి కారణమయ్యారని పలువురు ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.అంత్య క్రియలు ఆయన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సిద్ధాపురంలో జరిగాయి. అంత్యక్రియల్లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.అశోక్, ప్రిన్సిపల్ డా.ఎం.కమలకుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విభాగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం.పోచయ్య ఆధ్వర్యంలో ఆచార్య ప్రశాంతిశ్రీ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

**సంతాప సభలో ప్రముఖుల నివాళి:**

క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం.కమల కుమారి అధ్యక్షతన జరిగిన సభలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ సత్యనారాయణ గారు ఎంతో స్నేహశీలి, నిరాడంబరమైన వ్యక్తి అని ఎలాంటి సమస్యలెదురైనా వాటిని తట్టుకొని ధైర్యంగా నిలబడగలిగే మనస్తత్వం ఉన్న వ్యక్తిగా,ఎం.ఎస్. ఎన్ క్యాంపస్ లో ఆయనకి గల పాతికేళ్ల అనుబంధాన్ని, మంచి స్నేహాన్ని గూర్చి అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి జ్ఞాపకాలను పంచుకున్నారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు యూనివర్సిటీ బాసటగా నిలుస్తుందని, వారికి జరగవలసిన తగు సహాయ సహకారాలను అందిస్తామని తెలియజేశారు. క్యాంపస్ ప్రిన్సిపల్ డా.కమల కుమారి మాట్లాడుతూ ఎం.ఎస్.ఎన్ గారు ఎల్లప్పుడు ఒక అన్నగా, పెద్దదిక్కుగా సమస్యలెదురైనప్పుడు తన వంతు కృషిగా సహాయపడుతూ అధ్యాపకులకు,సిబ్బందికి ఒక మనోధైర్యాన్ని నింపిన వ్యక్తిగా, విద్యార్థులను ఒక మంచి మార్గం వైపు నడిపించి వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఒక తండ్రిలా చూసుకునే వారని, ఆయనని కోల్పోవడం నిజంగా చాలా బాధాకరమని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నప్పుడు స్పెషలాఫీసర్ గా పని చేసిన ప్రొఫెసర్ దోసగిరి రావు, ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, ఇంగ్లీషు విభాగాధిపతి ఎం.పోచయ్యలు సత్యనారాయణ గారి సహాధ్యాపకులు డా.పివి.కృష్ణ బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పూర్వ విద్యార్థులు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు.ఆయన ఆశయాలను కార్యరూపంలో ఉంచి విభాగ అభివృద్ధికి మార్గ నిర్దేశికాలుగా చేసుకుంటామని పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ కోర్సు కోఆర్డినేటర్ డా.కె.జోసెఫ్ స్టీఫెన్, డా.హరిబాబు, డా.గోపి, ఎండిఆర్ నదీమ్ అధ్యాపక మిత్రులు సంతాపాన్ని,ఆయనతో తమకు గల జ్ఞాపకాలను పంచుకున్నారు.




ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in